చంపినోడే అయ్యో అంటే..

ఆత్మ బలిదానాలకు ప్రధాన కారణం కాంగ్రెస్సే..

జే స్వప్నాసతీశ్‌కుమార్,
తెలంగాణ ఉద్యమకారురాలు
(మొయినాబాద్)

తెలంగాణ బిడ్డల ఆత్మ బలిదానాలకు ప్రధాన కారణం ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టే. ఎందుకంటే తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తున్నామని 2009 డిసెంబర్ 9న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలక వ్యక్తిగా ఉన్న చిదంబరం ప్రకటన చేశారు. అదే ప్రకటనను కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకకు తీసుకోవడంతో తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చేలా లేదని ఆత్మస్థైర్యాన్ని కోల్పోయిన తెలంగాణ బిడ్డలు 12 వందల మంది ఆత్మ బలిదానాలు చేసుకున్నారు. దీనికి కారణం నాటి కాంగ్రెస్ ప్రభుత్వం పుణ్యమే కాదా.. ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ ఇచ్చి ఉంటే వందలాది మంది చనిపోయేవారు కాదు. ఆత్మబలిదానాలను అవమానించే విధంగా చిదంబరం మాట్లాడటం బాధాకరంగా ఉన్నది.ఆత్మబలిదానాలకు.. కాంగ్రెస్‌కు ఎలాంటి సంబంధం లేదని చిదంబరం అనడం సిగ్గు చేటు.. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని.. చంకలు గుద్దుకుంటున్న కాంగ్రెస్ నేతలకు తెలంగాణ ప్రజలు బుద్ధి చెప్పడానికి చిదంబరం వ్యాఖ్యలతో సిద్ధమయ్యారు. ఇవ్వాల్సిన సమయంలో తెలంగాణ ఇచ్చి ఉంటే ఎందుకు ఇంత మంది చనిపోయేవారు. తెలంగాణలో ఎన్నికలు రావడంతో తెలంగాణ ఆత్మబలిదానాలకు.. కాంగ్రెస్‌కు పార్టీకి ఎలాంటి సంబంధం లేదని కాంగ్రెస్ ముఖ్య నేత అనడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉన్నది.. కాంగ్రెస్ కుట్రను తెలంగాణ ప్రజలు గమనించి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలి. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ చరిత్రను వక్రీకరించే పనిలో కాంగ్రెస్ పార్టీ ఉన్నది. కాంగ్రెస్ నాటకాన్ని ప్రజలు గమనించాలి.

సీఎం కేసీఆర్ ఆదుకున్నడు..

- నరాల అజయ్‌కుమార్,
అమరుడు తిరుమలేశ్ తమ్ముడు

తన అన్న నరాల తిరుమలేశ్ తెలంగాణ కోసం ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దదిక్కును కోల్పోయి బాధలో ఉన్న మా కుటుంబానికి ఎలాంటి లోటు రాకుండా సీఎం కేసీఆర్ చూసుకున్నాడు. తమ అన్న ఉద్యోగం చేసి తమ కుటుంబాన్ని పోషిస్తాడనుకున్న తరుణంలో ఆయన మృతి చెందడంతో తమ కుటుంబానికి దిక్కుమొక్కు లేకుండా పోయింది. ఈ తరుణంలో సీఎం కేసీఆర్ మా కుటుంబానికి రూ.10లక్షలు ఇచ్చి ఆదుకున్నాడు. ఇచ్చిన మాట ప్రకారం తనకు కార్మిక శాఖలో ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాడు. ముఖ్యమంత్రి అందించిన తోడ్పాటుతో తమ కుటుంబం ఎలాంటి చీకుచింత లేకుండా ఉన్నది. సీఎం కేసీఆర్ మా కుటుంబానికి అండగా నిలిచారు. సీఎం కేసీఆర్‌కు తాము రుణపడి ఉంటాం.

కుటుంబంలో ఒకరికి ఉద్యోగం.. రూ.10లక్షల ఆర్థిక సాయం

తిరుమలేశ్ కుటుంబాన్ని ఆదుకున్న తెలంగాణ ప్రభుత్వం

ఇబ్రహీంపట్నంరూరల్, నవంబర్ 18 : తన చావుతోనైనా తెలంగాణ రావాలని... తెలంగాణ వస్తే తనలాంటివారందరికీ ఉద్యోగాలొస్తాయన్నది నరాల తిరుమలేశ్ ఆలోచన... తాను ఇంజినీరింగ్ చదివి ఇంటి వద్ద ఉంటూ తల్లిదండ్రులకు భారం కాలేకపోతున్నానని తలవంపుతో గడిపేవాడు. తెలంగాణ ఇప్పుడు రాకపోతే ఇంకెప్పుడు రాదని అందరితో చెబుతుండేవాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఉద్యమానికి తాను స్వేతం ప్రాణాలర్పించడానికి సిద్ధంగా ఉన్నానని పలుమార్లు వేదికలపై ఉపన్యాసాలిచ్చాడు. అయినా..కేంద్ర ప్రభుత్వంలో చలనం రాకపోవడంతో ఇంట్లో ఎవరులేని సమయంలో తెలంగాణ కోసం తాను ప్రాణత్యాగం చేస్తున్నానని, తనలాంటివారి చావుతోనైనా తెలంగాణ వస్తే మిగతావారు బాగుపడతారని లేఖ రాసి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడ గ్రామానికి చెందిన నరాల తిరుమలేశ్ ఆత్మబలిదానం చేసుకుని చరిత్రలో చిరస్థాయిగా నిలిచాడు. నగరశివారుల్లోని టీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. ఇంజినీరింగ్ పూర్తి చేసిన తిరుమలేశ్ ఉద్యోగం రాక ఇంటివద్దనే ఉంటున్నాడు. తనకు ఉద్యోగం రాకపోవటంతో తన తమ్ముడు, తల్లిదండ్రులను ఎలా ఆదుకునేదని పలుమార్లు ఆవేదన వ్యక్తం చేసేవాడు. అందులో భాగంగానే 24-3-2010న ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న పరిస్థితిలో తెలంగాణ కోసం అనేకమంది బలిదానాలు చేసుకున్నారు. అదేవరుసలో తానుకూడా నిలువాలని భావించి ఆత్మహత్య చేసుకున్నాడు. తన ఆత్మహత్యతోనైనా తెలంగాణ ఏర్పడుతుందని గట్టిగా నమ్మేవాడు. తనలాంటి చదువుకున్నవారికి తెలంగాణ వస్తేనే ఉద్యోగాలొస్తాయని నమ్మి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ లెటర్‌లో రాసి తనువు చాలించాడు. అతడి మరణంతో ఇబ్రహీంపట్నంలో ఉద్యమం మరింత ఉధృతమైంది. తిరుమలేశ్ మృతదేహంతో ఇబ్రహీంపట్నంలో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఉద్యమనేతలంతా ఇబ్రహీంపట్నం సివిల్ ఆస్పత్రికి చేరుకుని నివాళులర్పించారు.

కాంగ్రెస్ దుర్నీతిని ఎండగడుతున్న ఉమ్మడి జిల్లా ప్రజానీకం

రంగారెడ్డి, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని, ఆత్మ బలిదానాలను అవమానించిన కాంగ్రెస్‌పై రంగారెడ్డి జిల్లా ప్రజానీకం భగ్గుమంటున్నది. డిసెంబర్ 9న చేసిన ప్రకటనను కాంగ్రెస్ వెనక్కి తీసుకోవడంతో జిల్లాకు చెందిన ఎందరో ఆత్మబలిదానాలు చేసుకోగా.. అప్పటి మరణాలతో తమకెలాంటి బాధ్యత లేదని కేంద్ర మాజీ మంత్రి చిదంబరం వ్యాఖ్యానించడంపై అమర వీరుల కుటుంబాలు, తెలంగాణ వాదులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అమరుల ఆత్మలకు అవమానం కలిగేలా మొక్కుబడి 'సారీ'తో సరిపెట్టి తెలంగాణ ఉద్యమ గాయాన్ని మళ్లీ రగిల్చారని యావత్ ప్రజానీకం మండిపడుతున్నది. ప్రజల కొట్లాట, ఎందరో అమరవీరుల త్యాగం, కేసీఆర్ తెగింపుతోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధ్యమైందని, పోరాటాల ఫలితంగా గతిలేని పరిస్థితిలో తెలంగాణ రాష్ట్రాన్ని ఇవ్వాల్సి వచ్చిందే తప్ప ఇక్కడి ప్రజలపై ప్రేమతో కాదని ప్రజానీకం గుర్తు చేస్తున్నది. ఉద్యమ సమయంలో శవ రాజకీయం చేసిన కాంగ్రెస్ దుర్నీతిని ఈ సందర్భంగా ఎండగడుతున్నారు.

కొట్టాడి తెచ్చుకున్న తెలంగాణ ఇది..

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కావాలే.. ఆంధ్రోళ్ల పెత్తనం పోయి మా ఉద్యోగాలు మాకు రావాలే.. మా ప్రాంతాల అభివృద్ధికి నిధులు రావాలే.. అన్నింటికన్నా ముఖ్యంగా బీడుబడ్డ మా పొలాలకు నీళ్లు రావాలే.. అని నాటి తెలంగాణ ఉద్యమ సారథి, నేటి సీఎం కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు యావత్ తెలంగాణ కదిలింది. ఇందులో రంగారెడ్డి జిల్లా సైతం భాగస్వామ్యమై ఉద్యమంలో తనవంతు పాత్రను పోషించింది. ఊరూ వాడా ఏకమై తెలంగాణ నినాదం ఎత్తుకుని ఉద్యమాన్ని తారాస్థాయికి తీసుకెళ్లింది. కానీ.. కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించలేదు. రాష్ట్ర ప్రభుత్వం అసలే పట్టించుకోలేదు. ఆంధ్రా నేతలు సైతం చెదిరింపులతో తెలంగాణ ఏర్పాటుకు మోకాలడ్డారు. ఇవన్నీ కుండ్లా జూసి తెలంగాణ రాష్ట్రం కల నెరవేరదేమోనన్న ఆందోళనతో జిల్లాకు చెందిన అనేక మంది ప్రాణత్యాగం చేశారు. ఎంత కొట్లాడినా తెలంగాణ రాదు.. మా బతుకులు బాగు పడవు.. మాకు ఉద్యోగాలు రావు.. అని లెటర్లు రాసి ఆత్మహత్యలు చేసుకున్నారు. సొంత రాష్ట్రం కల సాకారం కోసం కొందరు ఉరి వేసుకున్నారు. మరికొందరు ఒంటికి నిప్పంటించుకున్నారు. ఇంకొందరు క్రిమిసంహారక మందును తాగి ఆత్మార్పణం చేశారు. ఆ మరణాలను చూసి చలించిన కేసీఆర్ తెలంగాణ కోసం ఇగ ఒక్క ప్రాణం కూడా పోకూడదని సంకల్పించారు. ఏడైనా నాతో తేలిపోవాలె.. నేను చచ్చుడే.. తెలంగాణ వచ్చుడే.. ఏదో ఒకటి జరగాలని ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. అదే చివరి ఘట్టం కాగా.. ఆ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనుకూల ప్రకటన వచ్చింది.

తెలంగాణ అమరులను అవమానించిన చెయ్యి పార్టీ

అమరుల ఆత్మ ఘోషకు 'సారీ'తో సరిపెట్టిన చిదంబరం

తెలంగాణ ఉద్యమ గాయాన్ని మళ్లీ రగిల్చేలా వ్యాఖ్యలు

భగ్గుమంటున్న అమర వీరుల కుటుంబాలు, ప్రజలు



కడుపు తరుక్కుపోతున్న చిదంబరం వ్యాఖ్యలు..

తెలంగాణ ఉద్యమ సమయంలో కాంగ్రెస్ అనుసరించిన విధానాలను తల్చుకుంటే ఇప్పటికీ ప్రజల రక్తం ఉడుకుతున్నది. ఇక తాజాగా.. కాంగ్రెస్ మాజీ మంత్రి చిదంబరం చేసిన వ్యాఖ్యలతో కడుపు తరుక్కుపోతున్నది. ఆత్మ బలిదానాలతో ఇప్పటికీ ఆయా కుటుంబాలు కన్నీరుమున్నీరుగా విలపిస్తుండే.. చిదంబరం మానిన గాయాన్ని మళ్లీ రగిల్చారు. అమరుల చావుకు మా బాధ్యత లేదని.. చనిపోయినందుకు సారీ.. అంటూ సింపుల్‌గా చెప్పేసి వెళ్లిపోయారు. సాఫీగా సాగాల్సిన తెలంగాణ విభజనను కాంప్లికేట్ చేసిన వ్యక్తే మళ్లీ వచ్చి మళ్లాత్తాపం ప్రకటించడంపై.. చంపినోడే.. అయ్యో అని ఏడ్చినట్లు ఉందని ప్రజానీకం ఎద్దేవ చేస్తున్నది. వేల మంది ప్రాణాలు కోల్పోవడానికి కారకులు మీరు కాదా ? అంటూ ప్రశ్నిస్తున్నది. తెలంగాణను వల్లకాడు చేసి.. ఎందరో తల్లులకు పుట్టెడు దుఃఖాన్ని మిగిల్చింది కాంగ్రెస్ పార్టీయేనంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిక్కటి నెత్తురును చేతులకు అత్తరులా పూసుకుని అమరుల కుటుంబీకులపై కపట ప్రేమను ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ పార్టీని నమ్మే పరిస్థితిలో ఎవరూ లేరని అమరవీరుల కుటుంబీకులు, ఉద్యమ కారులు పేర్కొంటున్నారు.

అమరుల కుటుంబాలకు అండగా సీఎం కేసీఆర్..

ఉద్యమంలో ప్రాణాలు త్యజించిన అమరుల కుటుంబాలకు సీఎం కేసీఆర్ అండగా నిలిచారు. రూ.10 లక్షల ఆర్థికసాయంతోపాటు ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి భరోసానిస్తారు. ఇంటిపెద్దను కోల్పోయిన వారికి పెద్దదిక్కయ్యారు. తండ్రిలా.. అన్నలా.. కొడుకులా మారి అమరవీరుల కుటుంబాలకు ఏలోటూ రాకుండా చూస్తున్నారు. గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో అమరువీరుల త్యాగాల స్ఫూర్తితో అటు తెలంగాణ రాష్ట్రాన్ని, ఇటు జిల్లాను అన్ని రంగాల్లోనూ నంబర్ వన్‌గా తీర్చిదిద్దారు.

రామచంద్రగూడలోని ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి

పని చేసిన వారికే పట్టం కట్టండి..

మహేశ్వరం, నవంబర్ 18 : పని చేసే ప్రభుత్వానికే ప్రజలు పట్టం కట్టాలని సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరం మండల పరిధిలోని అకాస్‌పల్లి, గట్టుపల్లి, రామచంద్రగూడ, పెండ్యాల, కల్వకోల్, దుబ్చుచెర్ల, సుభాస్‌పూర్, అయ్యవారి పల్లి, దిలావర్‌గూడ, గాంధీనగర్ తండా, కోళ్లపడకల్, పోరండ్ల గ్రామాల్లో జరిగిన ఎన్నికల ప్రచారంలో జడ్పీ వైర్ పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో మండల ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గానికి ఇష్టం లేక వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థిని బీఆర్ఎస్ నాయకులు ఓడించాలన్నారు. మహేశ్వరంలో రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులకు, రియల్ సేవకురాలికి జరుగుతున్న ఎన్నికల యుద్ధంలో ప్రజలే న్యాయనిర్ణేతలని ఆమె తెలిపారు. ఎల్లప్పుడు ప్రజాసేవ చేస్తున్న నియోజకవర్గం ఆదిబిడ్డగా నన్ను దీవించి మహేశ్వరం ఎమ్మెల్యేగా గెలిపించాలని మంత్రి కోరారు. అభివృద్ధి పనులు పూర్తిగా కొనసాగాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. తెలంగాణ రాక ముందు గ్రామాలు ఎట్ల ఉండే.. ఇప్పుడు ఎలా ఉన్నాయో.. ప్రజలు ఆలోచించాలన్నారు. ప్రతి ఇంటికీ తాగునీటిని అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రైతు బంధు ద్వారా రైతులకు భరోసాను కల్పిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆదరించాలన్నారు. రైతు ఏ కారణం చేతనైనా మృతి చెందితే రైతుబీమా కింద రూ.5 లక్షలను అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. తెలంగాణకు కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఇప్పటి వరకు ఏం చేశారని ప్రజలు నిలదీయాలని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రాగానే ఆసైన్డ్ భూమి, లావాణి పట్టాలు ఉన్న వారందరికీ పట్టాలను అందజేయనున్నామని తెలిపారు. 3 గంటల కరెంటు కావాలంటే కాంగ్రెస్‌కు ఓటు వేయండి, 24 గంటల కరెంట్ కావాలంటే బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేయాలని సూచించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో దళిత బంధును ప్రతి ఒక్కరికీ అందజేస్తామన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు పంచే డబ్బు సంచులకు ఇక్కడి ప్రజలు మోసపోరని ఆమె అన్నారు. కరోనాలో కానరాని నాయకులు నియోజకవర్గంలో పొద్దున్నే ఇండ్ల ముందు కనపడుతున్నారని ధ్వజమెత్తారు. ఒక ఆడబిడ్డ యుద్ధంలో నిలబడింది.. నన్ను గెలిపించే బాధ్యతను మీరు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ నియోజకవర్గానికి మరోసారి సేవచేసే భాగ్యం మరోసారి కల్పించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైర్ పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు చిలక మర్రి సర్సింహ, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగోతు రాజునాయక్, ప్రధాన కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వర్కల యాదగిరిగౌడ్, ఎస్సీ, బీసీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బుసగల్ల జంగయ్య, రాఘవేందర్‌గౌడ్, అంగోతు గోపాల్‌నాయక్, సర్పంచ్‌లు అనిత ప్రభాకర్‌రెడ్డి, ముక్కెర యాదయ్య, శివరాజునాయక్, మంత్రి రాజేశ్, ధామస్‌రెడ్డి, స్వీనా రెడ్డి, గుత్తి పద్మపాండు, చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, శతుంతల నియోజకవర్గ ఉపాధ్యక్షుడు హనుమగల్ల చంద్రయ్య, కార్యదర్శి గుండెమోని అంజయ్య ముదిరాజ్, మండల రైతు బంధు సమితి అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు స్వప్నారవీందర్, సువర్ణారాంరెడ్డి, నాయకులు కందిరమేశ్, బండారు లింగం, జాన్‌రెడ్డి, ఆంజనేయులు గౌడ్, మునగపాటి నవీన్, ఏకుల రాములు, బుగ్గని ఇస్తారి, ధార జంగయ్య, బురమోని సర్సింహయాదవ్, మద్ది కరుణాకర్‌రెడ్డి, శివమూర్తి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కారుగుర్తుకే ఓటు వేస్తామని నినదిస్తున్న గిరిజన మహిళలు